# దేవుడు

దేవుడు అనే ఊహాచిత్రం ఎక్కడో లేదు. మంచి మనిషిలో వుంది.

—జయప్రద

"బాబాయ్! నాకు దుర్గగుడి చూపించకపోతే—నీకు తెలుసుగా నీ కెన్ని పనులున్నా సరే నే నొప్పుకునేది లేదు."

బాబాయ్ నన్నగా నవ్వాడు.

"అలాగే కానీ....అసలు నేను చెపుతున్నది నువ్వు వింటున్నట్టా లేక నా కంఠశోషా?"

"విన్నానులే బాబాయ్! అవి రోజూ వుండేవేగా! నా ఏడుసంవత్సరాల కోరిక ఈ రోజు తీరబోతుంటే....నువ్వు ఈరోజు కూడా వినిపిస్తున్నావు" కాస్త నిష్ఠూరంగా అన్నాను.

ఈసారి కాస్త పెద్దగా నవ్వాడు బాబాయ్.

"నీకు నవ్వుగానే వుంటుంది. ఈ ప్రోగ్రామ్ పూర్తయ్యేవరకు నువ్వు నా పెళ్ళి మాటలు మాట్లాడావంటే...."

"మాట్లాడను గానీ చూపెట్టొచ్చా?" నన్ను మధ్యలోనే అందుకున్నాడు.

చురుగ్గా బాబాయ్ వైపు చూచాను.

"మరి నన్నేం చేయమంటావ్. వాడూ ఇదేపనిమీద రాబోయే స్టేషన్‌లో ఇదే రైలు ఎక్కబోతున్నాడు."

"ఎవరు వాడు?" విసుగ్గా అడిగాను.

"ఇప్పుడు నేను వాగానే-అది వాడి గురించే" నా కంటె విసుగ్గా అన్నాడు బాబాయ్.

బాబాయ్ అంటే వరసకు హోదాకి చాలా పెద్దగానే అన్పించినా నా కంటే రెండేళ్ళే పెద్దవాడు. అప్పుడే పెళ్ళి చేసేసుకుని పిల్లల్ని కంటూ—అలా తనని నాకు రోజుకో పెళ్ళికొడుకు గురించి చెపుతూ నన్ను విసిగిస్తుంటాడు.

"ఇంట్లో నుండి రెండు రోజులు పారిపోయి వచ్చినా నాకీ శని తప్పదన్నమాట! అయినా ఇదంతా నీ ప్లానయ్యుంటుంది. నాకిష్టం లేదని అతనికి ముందే చెప్పేస్తాను."

"ఏమని, అతను రైలు ఎక్కడం నీకిష్టం లేదనా?"

ఇక బాబాయ్‌తో వాదించేశక్తి నాకులేదు. మౌనంగా కూర్చున్నాను.

తిరుమల ఎక్స్‌ప్రెస్ అతివేగంగా కర్ణకఠోరంగా చప్పుడు చేయకుండా వెళుతోంది.

బాబాయ్ ఆఫీసు పనిమీద విజయవాడ వస్తుంటే దుర్గ గుడి చూడాలనే కోరికతో నా ఆఫీసుకు సెలవు పెట్టి వచ్చేశాను.

ఏడు సంవత్సరాల క్రితం విశాఖపట్నంలో చదువుకునే రోజుల్లో సంవత్సరానికి మూడుసార్లు చొప్పున మూడు సంవత్సరంలో 12సార్లు ఆ కృష్ణ బ్రిడ్జిమీద వెళుతూ దేదీప్యమానంగా వెలిగిపోయే దుర్గగుడి వంక ఆశగా, నిరాశగా, నిస్సహాయంగా చూస్తూ ఎప్పటికయినా ఆ కొండ ఎక్కాలని నిర్ధారణ చేసుకున్న నాకు ఆ కోరిక తీరబోతున్న అందమైన తరుణమిది!

ఆ ఆనందంలో అపశృతిలాగా ఒంగోలు స్టేషన్‌లో బాబాయ్ గొంతుతో మరో గొంతు.

"ఎన్నాళ్ళయిందిరా అశోక్ మనం కలుసుకుని?" ఆ కంఠంలో నేనెరగని కొత్తదనం.

"మీ అమ్మాయి బాగుందా?" అవతలి గొంతు ప్రశ్న.

"ఎవరి సంగతి? ఓ! సీతా! నాతో వస్తోంది"

మొదట బాబాయ్ కంఠంలోని ఆశ్చర్యం.

ఆఖరి మాటలన్నప్పుడు రహస్యంగా మారిపోయింది.

"ఈజిట్!" ఆ కంఠంలో కాస్తంత ఆశ్చర్యం.

మరింత ఆనందం.

ఈ మహానుభావుడికి నేనెలా తెలుసా?

"నమస్తే!" ఎలాంటి బెరకుదనం లేకుండా వస్తూనే నామీద ఒక నమస్కార బాణంవేసేసి నాకెదురుగా బాబాయ్ ప్రక్కన కూర్చుని-ఇక నాతో పని లేనట్టు బాబాయ్‌తో జరిగిపోయినవి.

జరగాల్సినవి-ఏమిటేమిటో మాట్లాడేస్తున్నాడు.

ఇంతవరకు బింకంగా మాట్లాడిన నేను అతన్ని చూస్తూ కాస్త చల్లబడిన మాట వాస్తవం.

ఒడ్డూ, పొడుగూ, అందం, చందం సంగతి నాకు తెలియదుగానీ అతన్ని చూడగానే కవిత్వంరాని నాకు కూడా వర్ణించాలనిపించేంత అద్భుతంగా వుంది అతని నవ్వు మాత్రం.

"మీకు భక్తి జాస్తనుకుంటాను"

నేనింకా తేరుకోకముందే మా బాబాయ్ అతని మాటలు పూర్తి కాకముందే నావేపు తిరిగి అతను వేసిన ప్రశ్న చాలా అసందర్భంగా అన్పించింది.

జవాబు చెపుదామని తలెత్తిన నన్ను అతని అద్భుతమైన చిరునవ్వు మరి నోరు తెరవనియ్యలేదు.

అలాటి అద్భుతమైన నవ్వు మరో ముఖంలో చూస్తే ఎలా వుండునో కాని–ఇది నాకు పెద్ద ఆకర్షణయిపోయింది దుర్గ గుడిలా!

"ఈ రైల్లోనే అంగీకారం అంటే ఎలా? విజయవాడ వెళ్ళాక మాట్లాడుకుందాంలే"

ఉలిక్కిపడ్డాను.

"అంగీకారం అంటే....అసలు ఏం మాట్లాడుకుంటున్నారు వాళ్ళు?"

★ ★ ★ ★

"మూడు టికెట్లు కొనేశావా?"

"టిక్కెట్లు లేకుండా వెళదామనా నీ ఉద్దేశం?"

"టిక్కెట్లు లేకపోతే అమ్మో? మీ దేవుడు లోపలికి రానిస్తాడా?" నవ్వాడు అశోక్.

"మీ దేవుడంటున్నారు? మీకు దేవుడు లేడంటారా ఏమిటి?"

కొంత ఆశ్చర్యంగా, మరికొంత కుతూహలంగా అడిగాను.

"దేవుడున్నాడో లేడోగాని తన చుట్టూ అద్భుతమైన అందాలన్ని టినీ కుప్పగా పోసుకున్నాడు. అటు చూడండి"

అతడి మాట పూర్తిచేయకముందే ఆటో ఒక్క జర్క్ యిస్తూ ఆగింది.

ఆటోలో నుండి దిగుతూ అతను చూపినవేపు చూశాను.

"ఎంత అద్భుతంగా వుంది ఆ కొండ ఏటవాలుగా వంగి"

"ఇలాటివి చూస్తే-మీ దేవుడి సృష్టిని మెచ్చుకోకుండా నేనుండ లేను"

"మాటిమాటికి మీ దేవుడంటున్నారు మీరు" నాకు తెలీకుండానే నా మాటల్లో కాస్త నిష్టూరం కదలాడింది.

"అలాగే. ఇక అలా మాట్లాడను" అతని మాటలలో ఉన్న గంభీరత అతని పెదవులమీద లేదు.

అవి నవ్వుతూనే వున్నాయి.

"గుడిలోకి వెళ్ళాలని సాధించి గుడిబయటే కూర్చుండిపోయావ్ లే సీతా"

అయిష్టంగానే లేచాను.

అతను లేవలేదు.

"లేవరా అశోక్! అంతగా అయితే దర్శనం చేసుకున్నాక వచ్చి కూర్చుందువులే"

"మీరెళ్ళి రండి కాంతీ! నేను ఇక్కడ కాసేపు రెస్ట్ తీసుకుం టాను"

"నవ్వుతూంది మా సీత. చెట్టంతమనిషివి. నాలుగుమైళ్ళ ప్రయాణానికి అలసిపోయావా?"

"పదండి" లేచి నిలుచున్నాడతను.

సగం మెట్లు దిగగానే ఓ చిన్న తటాకం.

నిండా మురికి.

దాంట్లో బుడింగిన మునిగి చటుక్కున లేచే చేపపిల్లలు. అందముగా వున్నాయి.

ఎడమ ప్రక్కకు తిరిగాను.

"దుర్గ మహిమలమీద సినిమా చూపెడుతున్నారు భక్తులకు. వెళదామా బాబాయ్" సరదాగా అన్నాను"

"దుర్గ మహిమకు పబ్లిసిటీ అవసరంలేదు. అదేంచూస్తాం రండి"

కాస్త బ్లంట్‌గా అన్న అతని మాటలకు నా అభిమానం దెబ్బ తిన్నది.

నేను బాబాయ్‌ని అడుగుతుంటే మధ్యన ఇతనెవరు?

నా ముఖంలో భావాలు కనిపెట్టినట్టున్నాడు.

"నేను తమాషాకన్నాను సునీతగారూ! మీరు సీరియస్‌గా తీసుకోవద్దు. రండి చూద్దాం"

"వద్దులెండి"

పిట్టగోడను ఆనుకొని కిందికి చూస్తున్నాను.

అశోక్ అల్లంత దూరాన కనబడ్డాడు.

అతనికి ఆవతలగా విజయవాడ పట్టణం అద్భుతంగా సుందరంగా నిలిచి వుంది.

అందులో బహుశా అతను లీనమై వుండొచ్చు.

"అశోక్‌గారూ! చూడండి కృష్ణ ఎంత అందంగా వుందో"

అతను సన్నగా నవ్వి నాతో ఏకీభవించాడు.

అతని కళ్ళలో కదలాడిన స్నేహభావానికి సిగ్గుపడి తలదించుకున్నాను.

ఎక్కడ పట్టుకున్నాడో బాబాయ్- ఆయన స్నేహితుణ్ని ఆయన చెయ్యిపట్టుకుని లాక్కొస్తున్నాడు.

"నీతా! వీడే! చెప్పానుగా....మధూ అని!"

"నమస్తే" బాబాయ్‌ను మధ్యలోనే ఆపేయకపోతే తన స్నేహితుడి తాలూకు పుట్టు పూర్వోత్తరాలన్నీ చెప్పడం మొదలెట్టేస్తాడు.

అతనికింకా పెళ్ళికాకుండా వుండుంటే నా దురదృష్టం మరీ పండిపోయిందన్న మాటే!

"అరెఁ అశోక్! ఏమిటలా దూరంగా నిలబడిపోయావ్! రా. క్యూ జరుగుతోంది" కృష్ణ వైపునుండి తలత్రిప్పి చిన్నగా నవ్వి నాలుగు అడుగులేసి నా వెనగ్గా వచ్చి నిల్చున్నాడు అశోక్.

"రండి వెళ్దాం"

"ఎక్కడికి?"

"క్యూలో ఎందుకు? మధూ నేరుగా లోపలకు తీసుకెళతానంటున్నాడు. ఆ కమ్మల్లో నుండి మెల్లిగా దూరి వచ్చేయండి."

"నోనో కాంతి-కాస్త ఆలస్యమయితేనేం? దేవుడి దగ్గరకు దొంగదారులెందుకు? ఇక్కడ అసలు చాలా బాగుంది. సునీతగార్కి విసుగ్గా వుంటే వెళ్దాం."

"నాకూ ఇదే బాగుంది" అనేశాక నాలిక్కరుచుకున్నాను. బాబాయ్‌కి తెలుసు నాకు క్యూలో వెళ్ళడమంటే ఎంత విసుగో...."

బాబాయ్ కళ్ళలోకి చూశాను గిల్టీగా.

నవ్వాడు బాబాయ్. ఆ నవ్వులో అర్థం స్ఫురించి చప్పున కళ్ళు తిప్పేసుకున్నాను.

మొత్తానికి మరికొంత సేపటికి బాబాయ్ బలవంతం మీద నేరుగా గర్భగుడిలోకి ప్రవేశించాం.

వివిధమైన భావస్పందనల మధ్య తేలిపోతూ ఒక్కొక్క అడుగే వేస్తూ ఆ చిన్న గుడిని చుడుతూ వెళ్తున్నాను. గుడి వెలుపల ప్రసన్నంగా వున్న అశోక్ ముఖం గుడిలోపల కొచ్చాక నల్లగా, విసుగ్గా, మారి పోవడం నేను గమనించక పోలేదు.

గుడి లోపల మూడు క్యూలు. ఒకటి ధర్మదర్శనం. ఆ క్యూ దేవుడికి చాలా దూరాన్నుంచే తిరిగి జరిగిపోతోంది. రెండోది టిక్కెట్టు కొన్న క్యూ. అది గర్భగుడి ముందు కమ్మీల వెనగ్గా దేవుడికి మరి కాస్త దగ్గరగా నడుస్తోంది. మూడోది మాది. ఏకంగా గర్భగుడిలోకి స్వర్గానికి డైరెక్ట్ రూట్!

అశోక్ గుడిలోకి రాలేదు. అటునుండి అటే వెళ్ళిపోయాడు. ఈ కొద్ది క్షణాల్లో అతనిపై కలిగిన స్నేహభావంతో అనుకున్నాను.

'గుడిదాక వచ్చిన అతను గుడిలోకి రాకూడదూ! ఆ తర్వాత ఏమైనా అశుభం జరుగుతుందో ఏమో!'

అంతటితో నా మనసు ఊరుకోలేదు.

అతని ఈ దుష్ప్రివర్తనకు దుర్గకు అతని తరపున క్షమాపణలు కూడా చెప్పేసుకున్నాను.

గుడి బయటకొచ్చాక అడిగాను. "అదేం గుడిలోకి రాకుండా వచ్చేశారు?"

విసుగు తెరమీద మందహాసపు ముసుగు కప్పుకుంటూ అన్నాడతను.

"పోనివ్వండి—మీరింత మంది భక్తులుండగా నే నొక్కణ్నీ రాక పోతేనేం? అయినా దుర్గను చూడగానే మీరు జడుసుకో లేదూ!"

అతని జవాబు, హాస్యం నాకు కాస్త చిరాకన్పించాయి.

"ఒక్క క్షణం వుండండి. నా టిక్కెట్టు మిగిలిపోయింది. అమ్మేస్తాను" అన్నాడు.

"పోనిద్దూ అశోక్. వాళ్ళసలు తీసుకోరు"

"సగంరేటుకు అమ్మేస్తే వద్దనే భక్తుడు ఎవరుంటారంటావ్" అంటూ నిర్లక్ష్యంగా దిగి వెళ్ళిపోయాడు.

"వెధవ రూపాయి టిక్కెట్టు అమ్ముకోకపోతేనేం! మరీ లోభి లాగున్నాడు. అందుకే గుడిలోకి రాలేదేమో" అనుమానం రావాలేగాని దానికి ఎన్ని భావాలంకారాలయినా చోటు చేసుకోవచ్చు. భగవంతుని నమ్మినవాడిలో సున్నితత్వం, పాపభీతి వుంటాయి,

"అమ్మో ఇతనిని పెళ్ళి చేసుకోవాలా? జీవితాంతం భరించాలా?"

"బాబూ కుష్టువాణ్ని బాబూ! ఎందుకు పనికిరాని జన్మబాబూ" ఎవరో బిచ్చగాడు.

చటుక్కున వెనక్కు తిరిగాను. అశోక్ ఎదురుగా కుష్టువాడు. అశోక్ చేతిలో రూపాయి.

అశోక్ క్షణంకూడా ఆలోచించలేదు. వెంటనే ఆ రూపాయి అతని పాత్రలో వేసేసి బాబాయ్‌తో ఏదో అంటూ అటోవైపుగా నడుస్తున్నాడు.

"ఏమంటావ్ సీతా! అశోక్ నీకు నచ్చాడా?"

'మీకు భక్తి జాస్తనుకుంటాను' అని హేళనగా పలకరించిన అశోక్-

'టిక్కెట్టు లేకపోతే అమ్మో! మీ దేవుడు లోపలకు రానిస్తాడా?" అని దేవుడు మీదే జోక్ విసిరిన అశోక్-

'దుర్గ మహిమకు పబ్లిసిటీ అవసరంలేదు. అదేం చూస్తారండి' తన సరదామీద దెబ్బకొట్టిన అశోక్-

గుళ్ళోకి వచ్చి దేవిని చూడకుండా వెనక్కు వెళ్ళడానికి కొద్దిగా కూడా జంకని అశోక్,

కనీసపు ఒక్క రూపాయి టిక్కెట్టును తిరిగి అమ్మి తన లోభత్వాన్ని ఋజువు చేసుకొన్న అశోక్,

కొన్ని నిమిషాల క్రితంవరకూ అలా నా హృదయంలో చికాగ్గా నిలబడ్డ అశోక్ అతను.

కానీ, ఇప్పుడు-నా అనుమానాలన్నీ పూర్తిగా విడిపోయాయి.

దయనీయుడిలో భగవంతుని చూచిన అశోక్ నా హృదయంలో పూర్తిగా చోటు చేసుకొన్నాడు.

"వాడికి ఏం చెప్పమంటావు సీతా!" బాబాయ్ అడుగుతున్నాడు.

నేను వెంటనే అంగీకారంగా తలూపేనుశా.

బాబాయ్ కళ్ళలో ఆశ్చర్యం, ఆనందం.

*